క్లుప్తంగా

మాజీ సర్పంచ్ మృతి


యాదమ్మ (ఫైల్)

రాయపర్తి : మండలంలోని మొరిపిరాల మాజీ సర్పంచ్ అన్రెడ్డి యాదమ్మ అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామానికి ఆమె చేసిన సేవలను స్మరిస్తూ గ్రామస్తులు కంటతడి పెట్టారు.

గుండెపోటుతో రైతు..


లక్ష్మణ్ (ఫైల్)

దుగ్గొండి : గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన నాచినపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బండారి లక్ష్మణ్ (40) తనకున్న ఎకరం భూమితోపాటు మరో రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి పత్తి విత్తనాలు విత్తాడు. వర్షాలు కనుమరుగు కావడంతో ప్రతిరోజు భూమి వద్దకు వెళ్లి వస్తుండే వాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం బావి వద్దకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. కాసేపటికి గుండెలో నొప్పి అని లక్ష్మణ్ కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడి బహిష్కరణ

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మట్ట చిన్న రమేశ్ అలియాస్ దయాకర్‌ను బహిష్కరించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తుండడంతో క్రమశిక్షణ చర్యలో భాగంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బహిష్కరించినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి చిన్న రమేశ్‌కు పార్టీతో సంబంధం ఉండదని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్లకు గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్లకు గాయాలైన ఘటన నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి శివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట నుంచి మల్లంపల్లి దిశగా వెళ్తున్న లారీ, ఇటుకాలపల్లి శివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న మరో లారీ ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు లారీలను నడుపుతున్న డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. నర్సంపేట-మల్లంపల్లి మార్గంలో ప్రయాణించే వాహనాల రాకపోకలు స్తంభించాయి. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి ఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కుక్కల పిచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాని ఆమె కూతురు సంధ్యారాణితో కలిసి 2008-09లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు గురువారం రూ.15 వేల సాయం అందజేశారు. తొలుత సంధ్యారాణిని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంధ్యారాణి స్నేహితులు అబ్బరబోయిన ప్రవీణ్, మహేశ్, కుక్కల సతీశ్, పొన్నబోయిన రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ సోహెల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకన్న, నాయకులు మచ్చ కుమారస్వామి, వశపాక ఎల్లయ్య, వశపాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ వర్షం.. జనం బెంబేలు

● రోడ్డెక్కుతున్న డ్రెయినేజీ నీరు


నర్సంపేట రూరల్ : జలమయమైన ప్రభుత్వ పాఠశాల

నర్సంపేట : బాబోయ్ వర్షం.. అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. నర్సంపేటలో పరిస్థితి అలా తయారైంది. పట్టణంలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి డ్రెయినేజీ కాల్వలు పొంగిపొర్లాయి. డ్రెయినేజీల్లోంచి మురుగు నీరు రోడ్లపైకి చేరింది. పట్టణంలోని 24 వార్డుల్లోనూ ఈ దుస్థితి నెలకొంది. పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో స్వల్ప వర్షానికి సైతం మురుగు నీరు రోడ్ల మీదకు చేరుతుండడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసిన ప్రతీసారి మురుగు నీరు రోడ్లపై పారుతూ లోతట్టులో ఉన్న ఇళ్లలోకి చేరుతుండడంతో లోతట్టు ప్రాంతాల వాసులు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గంగపుత్ర సంఘం భవనం వద్ద కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన చిన్న పైపు ప్రస్తుత మురుగు ప్రవాహానికి సరిపోవడం లేదు. పట్టణంలోని పలు వార్డుల్లో పాత వాటి స్థానంలో కొత్త డ్రెయినేజీలు నిర్మించినా గంగపుత్ర సంఘం కాలనీలో ఒక్క సైడ్ డ్రెయినేజీ కూడా నిర్మించకపోవడం స్థానికులను తీవ్ర అసహనానికి గురి చేస్తోంది. పాత కాల్వ ఎత్తు తక్కువగా ఉండడం, రోడ్డుకు మరో వైపు కాల్వ లేకపోవడంతో స్థానికులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వర్షాలు కురిసినా డ్రెయినేజీ నీరు జనావాసాల్లోకి రాకుండా కొత్తగా కాల్వలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాల జలమయం

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని 4వ వార్డు పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ వర్షానికి జలమయమైంది. విద్యార్థులు తరగతి గది నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. పాఠశాల ఆవరణ నీటితో నిండిపోవడంతో విద్యార్థులు వేదనకు గురవుతున్నారు. అధికారులు పాఠశాలను సందర్శించినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా కలెక్టర్ స్పందించి పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


నర్సంపేట : గంగపుత్ర సంఘం వీధిలో రోడ్డుపైకి చేరిన వర్షపు, డ్రెయినేజీ నీరు

కెనడాలో పంటలపై ఎమ్మెల్యే అధ్యయనం


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : కెనడాలో అధునాతన పంటలపై తాను అధ్యయనం చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. కెనడా పర్యటనలో ఉన్న ఆయన మీడియాకు గురువారం వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడిగా, ఎమ్మెల్యేగా కెనడాలోని వివిధ రకాల పంటలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కెనడాలో వ్యవసాయ పద్ధతులు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గ రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా తాను కెనడాలో పర్యటించి పంటలను పరిశీలిస్తున్నట్లు వివరించారు.

అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కీలకం

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


అవార్డుతో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, తదితరులు

గీసుకొండ : పల్లెలను అభివృద్ధి పథాన నడిపించడంలో ప్రజాప్రతినిధులు కీలకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా గుర్తింపు పొందిన మరియపురం గ్రామానికి ఇటీవల రాష్ట్రస్థాయి పర్యావరణ పరిరక్షణ అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అవార్డు రావడానికి కారకులైన మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డిని, పంచాయతీ కార్యదర్శి నల్లెల స్వప్నను ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి హనుమకొండలోని తన నివాసంలో గురువారం అభినందించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అవార్డు అందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తే గ్రామాలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో ముందుంటాయని చెప్పారు. మరియపురం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంలో ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి మరువలేనిదని తెలిపారు. బాలిరెడ్డి సేవా నిరతిని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రేవూరి శ్రీనివాస్‌రెడ్డి, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత ప్రధానం


వైద్యపరీక్ష చేయించుకుంటున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం : ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత ప్రధానమని డాక్టర్ ప్రశాంత్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు తెలిపారు. హనుమకొండకు చెందిన అజర ఆస్పత్రి ఏరియా మేనేజర్ వడ్డే రాజశేఖర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో డాక్టర్ ప్రశాంత్, ఎంపీపీ ప్రకాశ్‌రావు మాట్లాడారు. వర్షాకాలం మొదలవుతున్న ప్రస్తుత తరుణంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా నీరు, ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలని చెప్పారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కోరారు. తొలుత పలువురికి బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గిరి, సందీప్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలను అడ్డుకోండి


ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట డివిజన్ పరిధిలోని ప్రైవేట్ స్కూళ్లలో నోట్‌బుక్స్ విక్రయం, తదితర అక్రమాలను అడ్డుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) డివిజన్ కన్వీనర్ పూర్ణచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాలకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పూర్ణచందర్ మాట్లాడారు. పలు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నాయని తెలిపారు. విద్యను అంగడి సరుకులా మార్చేశారని ఆందోళన వెలిబుచ్చారు. నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం, తదితర మండలాల్లోని ప్రైవేట్ స్కూళ్లలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న స్కూళ్లను వెంటనే మూసేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు జాటోత్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

గూడూరు : మండలంలోని చిర్రకుంటతండా గ్రామ శివారు పూల్‌సింగ్‌తండాలో గురువారం ఎస్సై సీహెచ్.నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి బాధ్యులైన ముగ్గురుపై కేసి నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బిచ్చానాయక్, రవీందర్‌రెడ్డి, ఎర్రయ్య, లక్ష్మయ్య, రాధిక, కుమార్, ప్రేమ్, సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

తొర్రూరు : తొర్రూరు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో డీఎస్పీ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు రూ.68 వేల విలువ చేసే 170 లీటర్ల గుడుంబా, రూ.7.75 లక్షల విలువ చేసే 7,750 లీటర్ల చెక్కెర, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా 16 మందిపై కేసులు నమోదు చేశారు. ఎవరైనా గ్రామాల్లో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

క్రీడా పాఠశాలలను వినియోగించుకోండి



చెన్నారావుపేట : హకీంపేట, హైదరాబాద్ హకీంపేటలోని క్రీడా పాఠశాలను అర్హులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ గోవిందరావు కోరారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 27న జిల్లాస్థాయిలో సెలక్షన్స్ నిర్వహిస్తారని తెలిపారు. వరంగల్‌లోని ఓసీటీ స్టేడియంలో 27న జిల్లా యువజన, క్రీడల అధికారులు మండలానికి చెందిన బాలలకు ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. సెలక్షన్స్‌కు వెళ్లే బాలలు 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రొగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్ వెంట తీసుకెళ్లాలని సూచించారు. 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్ట్ 31లోగా జన్మించిన వారు అర్హులని వివరించారు.

మార్నేనికి అభినందనల వెల్లువ



రాయపర్తి (వర్ధన్నపేట): టీఎస్ కాబ్ చైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో మార్నేని రవీందర్‌రావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ పట్టణ సీనియర్ నాయకుడు మహ్మద్ అఫ్సర్, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, తితరులు గురువారం ఆయన్ను కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జ వీర రాఘవరావు, బక్కతట్ల రాజు, దీకొండ యుగేందర్, సోహేల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

రాయపర్తి (వర్ధన్నపేట) : వివిధ ఘటనల్లో పట్టుబడిన ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్లకు వర్ధన్నపేటలోని ఎక్సైజ్ స్టేషన్‌లో నేడు (శుక్రవారం) వేలం నిర్వహించనున్నట్లు ఆ శాఖ సీఐ స్వరూప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

దాడులు మానుకోవాలి

తొర్రూరు : ప్రాథమిక చికిత్స చేసి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న ఆర్ఎంపీలపై తనిఖీల పేరిట మెడికల్ కౌన్సిల్ చేస్తున్న దాడులను మానుకోవాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకుడు అనపురం వెంకన్న, షేక్ అంకూస్ కోరారు. ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా అధికారులు దాడులు నిర్వహిస్తూ ఆర్ఎంపీలను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. గ్రామీణ వైద్యులకు పారా మెడికల్ శిక్షణ అందించి సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దొంతు సత్యం, మాదారపు ప్రకాశ్, గొడిశాల నవీన్, భీమయ్య, ధర్మారపు హన్మంతు, వెంకన్న, అంబదాసు, వెంకటేష్, క్రాంతి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దామెర : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఇష్టబోయిన ప్రవళిక ఒగ్లాపూర్‌లోని సైలానీబాబా దర్గాలో గురువారం అదృశ్యమైంది. ఎస్సై అశోక్ ప్రకారం.. ప్రవళిక తల్లి ప్రమీలతో కలిసి సైలానీ బాబా దర్గాకు ఈనెల 11న రాగా తల్లి ప్రమీల మంచినీళ్ల కోసం వెళ్లి వచ్చే సరికి ప్రవళిక కనిపించకుండా పోయింది. ప్రవళిక తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : ఐనవోలు, కొండపర్తి, గర్మిళ్లపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ పద్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాగపురం, కొండపర్తి గర్మిళ్లపల్లికి ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ నగేశ్

ఖానాపురం : విత్తనాలను విక్రయించడంలో ఎరువులు, పురుగు మందుల డీలర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని నర్సంపేట ఏడీఏ కేసరి నగేశ్ తెలిపారు. మండలంలోని ఖానాపురం, అశోక్‌నగర్, బుధరావుపేట, ధర్మరావుపేట, తదితర గ్రామాల్లోని పలు ఎరువుల షాపులను గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని చెప్పారు. అధిక ధరలకు విక్రయించినా, సీల్ లేకుండా విత్తన సంచులను విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే షాపుల అనుమతులు రద్దు చేస్తామని తెలిపారు. విత్తనాలు విక్రయించే సమయంలో పూర్తి వివరాలతో రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని తేటతెల్లం చేశారు. కార్యక్రమంలో ఏఓ బోగ శ్రీనివాస్, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం

● ఎస్ఈ మధుసూదన్‌రావు


మాట్లాడుతున్న ఎస్ఈ మధుసూదన్‌రావు

ఖానాపురం : అర్హులందరికీ విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని ఆ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) మధుసూదన్‌రావు స్పష్టం చేశారు. మండల కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి రైతులతో మాట్లాడారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూముల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి అటవీ శాఖ నుంచి అనుమతి అవసరమని చెప్పారు. పోడు భూముల్లో విద్యుత్ కనెక్షన్ కోసం వచ్చిన దరఖాస్తులను అనుమతి కోసం అటవీ శాఖ అధికారులకు పంపించినట్లు తెలిపారు. పోడు భూముల్లోనూ విద్యుత్ సరఫరాకు తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చిన వెంటనే అర్హులందరికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తామని భరోసా ఇచ్చారు. విద్యుత్ కనెక్షన్ కోసం ఎవరు కూడా దళారులను, ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించొద్దని కోరారు. కార్యక్రమంలో డీఈ శ్రీధర్, ఏఈ సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’ వెతలు

● సర్వర్ సమస్యతో తిప్పలు


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వేచి ఉన్న ప్రజలు

ఖానాపురం : గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేయడంలో వెతలు తప్పడం లేదు. ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ సదుపాయం కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గృహజ్యోతి పథకం వర్తించక గ్రామీణ ప్రాంతాలకు చెందిన వేలాది మంది అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నెలల పాటు ఎదురు చూసిన పేదలు అవి ముగిశాక ప్రస్తుతం సర్వర్ సమస్యతో సతమతమవుతున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి ప్రతీరోజూ పేదలు పెద్ద సంఖ్యలో చేరుకుని గృహజ్యోతి పథకం వర్తింపు కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూడాల్సిన దుస్థితి కనపడుతోంది. అయినా పని కాకపోవడంతో తీవ్ర అసహనంతో ఇంటి దారి పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దినసరి కూలీ, వ్యవసాయ పనులు మానుకుని మండల కేంద్రంలోని కార్యాలయం ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నా పని కావడం లేదంటూ పలువురు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి గృహజ్యోతి పథకం దరఖాస్తు చేసుకోవడంలో అర్హులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమన్వయంతోనే గ్రామాల పురోగతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రంగయ్య

రాయపర్తి (వర్ధన్నపేట) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు పురోగతి సాధిస్తాయని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పల్లెల్లోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అధికారులు సమాధానమిచ్చారు. పాఠశాలలు తెరుచుకుంటున్న నేపథ్యంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని విద్యాశాఖాధికారులకు ప్రజాప్రతినిధులు సూచన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అప్పారావు, జెడ్పీటీసీ భిక్షపతి మాట్లాడారు. మండల సమగ్రాభివృద్ధి దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు సెల్‌ఫోన్లు చూస్తూ నిర్లక్ష్యంగా కన్పించడంతోపాటు కొందరు మధ్యలోనే జారుకోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం అయ్యింది. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘మేడిగడ్డ’తో ప్రజాధనం దుర్వినియోగం

● ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టయ్య


మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న నాయకులు

నర్సంపేట : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టు (కేఎల్ఐపీ)ను నాసిరకంగా చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని అఖిల భారత రైతు సమైక్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వసుకుల మట్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. ఆ సంఘం బృందం కాళేశ్వరం మేడిగడ్డ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును గురువారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా మట్టయ్య, రమేశ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. తెలంగాణలోని 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని నమ్మించి సుమారు లక్ష కోట్ల రూపాయల వ్యయంతో 240 టీఎంసీల సామర్థ్యంతో ప్రారంభించి పూర్తి చేసిందని తెలిపారు. నాసిరకం పనులు, తప్పుడు డిజైన్లు, కాంట్రాక్టర్ వద్ద లాలూచీకి పాల్పడడంతోపాటు అధికారులను తప్పుదోవ పట్టించి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని నీటి పాలు చేశారని ధ్వజమెత్తారు. నాటి ప్రభుత్వ అవినీతికి కుంగిపోయిన పిల్లర్లు, నెర్రెలు బారిన ప్రాజెక్టు అద్దం పడుతున్నట్లు తెలిపారు. సుందిళ్ల అన్నారం బ్యారేజీ పరిస్థితి అదే విధంగా ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రస్తుత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా చిత్తశుద్ధితో నాణ్యత లోపాలను సవరించి తక్షణమే ప్రాజెక్టుపై ఆధారపడిన రైతాంగానికి సాగునీరును, ప్రజలకు తాగునీరు అందించేలా త్వరగా చర్యలు చేపట్టాలని కోరారు.

దుగ్గొండి : బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలోని బృందం గిర్నిబావి నుంచి బయల్దేరింది. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా చెప్పుకుని లబ్ధి పొందాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చూసిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పస్కుల మట్టయ్య, నాగెల్లి కొంరయ్య, మల్లికార్జున్, ఇస్మాయిల్, భరత్ పాల్గొన్నారు.

టాపర్‌కు అభినందనలు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌కు చెందిన మడుపోజు భువనకృతి పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలవగా ఆమెను నందీశ్వర గార్డెన్‌లో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ వరంగల్, హనుమకొండ జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అభినందించారు. భారతీయ విశ్వకర్మ పరిషత్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పున్నమాచార్యులు, ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీరచారి, ప్రధాన కార్యదర్శి శంకరాచారి, తదితరులు పాల్గొన్నారు.